సాక్షి
శ్రీకాకుళం

ఆదివారం । 1 । జనవరి । 2023

దూరప్రాంతాలకు ప్రత్యేక రాయితీ

శ్రీకాకుళం అర్బన్: సంక్రాంతి సందర్భంగా దూర ప్రాంతాలకు ప్రయాణించే వారికి రాయితీ కల్పిస్తున్నట్లు ఆర్టీసీ డీపీటీఓ ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాలకు వెళ్లే వారు రాను,పోను ఒకే సారి రిజర్వేషన్ చేయించుకుంటే పది శాతం, దూర ప్రాంతానికి నలుగురు ఒకేసారి టికెట్ తీసుకుంటే 5%, ఈ-వాలెట్ ద్వారా బుక్ చేసుకుంటే 5%, వృద్ధులకు 25% రాయితీ ఇస్తామన్నారు.

ఎమ్మార్పీకే విక్రయించాలి

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోని షాపులను ఆర్టీసీ అధికారులు శనివారం పరిశీలించారు. షాపులకు కేటాయించిన విధంగా సరుకులు ఉండాలని, ధరల పట్టిక ఆరుబయటే ఉంచాలని, ఎమ్మార్పీకే అమ్మాలని సూచించారు. నిబంధనలు పాటించని దుకాణాలకు ఫైన్ వేశారు. మొత్తం పది దుకాణాలకు వెయ్యి చొప్పున రూ.10వేలు జరిమానా విధించారు.

నేటి నుంచే పెంచిన పింఛన్ల పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక ఆదివారం నుంచి పంపిణీ చేయనున్నారు. కొత్తవారికి మాత్రం 3వ తేదీ నుంచి పింఛన్లు ఇవ్వనున్నారు. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ మొత్తాన్ని రూ.2,750కు పెంచారు. కొత్త, పాత పింఛన్లు కలిపి ఈ నెలకు గాను జిల్లాకు 3,19,563 మందికి రూ.86.57 కోట్లు అందజేయనున్నారు.

2న ఉత్తర ద్వార దర్శనాలు

- మాస్కులు తప్పనిసరి



విద్యుత్ దీపాలతో అలంకరించిన నారాయణ తిరుమల

శ్రీకాకుళం కల్చరల్: వైష్ణవ క్షేత్రాల్లో 2న ఉత్తర ద్వార దర్శనాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆలయాలను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు. భక్తులు మాస్కులతో హాజరు కావాలని దేవదాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఆలయాల్లో విష్ణు సహస్ర నామ పారాయణాలు, సామూహిక పారాయణాలు జరుగుతాయి.

అరసవల్లి: అరసవల్లి ఆదిత్యక్షేత్రంలో సోమవారం ముక్కోటి ఏకాదశి ఉత్సవం జరుగుతుందని ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు భక్తులకు ఉత్తర ద్వారం నుంచే దర్శనాలుంటాయని తెలిపారు. అంతరాలయ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

2022 గతం..
2023కు స్వాగతం

ఇంటి గోడకు కాలం కొత్త నేస్తాన్ని బహుమతిగా ఇచ్చింది. పన్నెండు మాసాల పాత క్యాలెండర్ గతమైపోగా.. 365 రోజుల ఆయుష్షుతో కొత్త ఏడాదికి కాలం పురుడు పోసింది. గుండెలోని జ్ఞాపకాల గదిలోకి నిన్నటి రోజులన్నీ వెళ్లిపోగా.. నిర్మలమైన మనసు కొత్త రోజులను ఆహ్వానిస్తోంది. నూతన ఏడాదికి సిక్కోలు నిండు గుండెతో స్వాగతం పలికింది.



శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలిలో నూతన సంవత్సర వేడుకల్లో యువత

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి



నూతన సంవత్సరంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదల పాలిట పెద్దన్నగా నిలుస్తున్నారు. 2023లో మరిన్ని కార్యక్రమాలను దిగ్విజయంగా పూర్తి చేయాలి. కోవిడ్ ప్రబలకుండా ప్రజలు పూర్తిగా జాగ్రత్తలు తీసుకోవాలి.

– తమ్మినేని సీతారాం, స్పీకర్

భద్రంగా ఉండండి



జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. యువత తమ లక్ష్యాలను చేరుకోవాలి. పండగ వేళల్లో ప్రమాదాలు జరగకుండా భద్రంగా ఉండండి. హెల్మెట్ ధరించి వాహనాలు నడపండి.

– జీఆర్ రాధిక, ఎస్పీ

సుఖసంతోషాలతో ఉండాలి



ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. కొత్త ఏడాదిలో అందరూ సుఖసంతోషాలతో ఉండాలి. సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో రాష్ట్రం మరింత ప్రగతి సాధించాలి.

– ధర్మాన ప్రసాదరావు, రెవెన్యూ మంత్రి

సీఎంకు మరింత శక్తి రావాలి



నూతన ఏడాదిలో మరిన్ని సంక్షేమ పథకాలు అందించడానికి సీఎం వైఎస్ జగన్‌కు మరింత శక్తి రావాలి. రాష్ట్ర ప్రజలకు, జిల్లా ప్రజలకు అందరికీ మేలు జరగాలి.

– డాక్టర్ సీదిరి అప్పలరాజు, రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమల శాఖ మంత్రి

భోగభాగ్యాలివ్వాలి



జిల్లా ప్రజలకు 2023 భోగ భాగ్యాలను ఇవ్వాలి. కోవిడ్ మళ్లీ వ్యాపిస్తోందన్న హెచ్చరికల నేపథ్యంలో అంతా అప్రమత్తం కావాలి. వీలైనంత వరకు తగు జాగ్రత్తలు పాటిస్తూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, క్షేమంగా ఉండాలి.

– శ్రీకేష్ బి.లాఠకర్, కలెక్టర్

మంచు కౌగిట..

- ఉదయం 10 వరకు మంచు తెరల మధ్య శ్రీకాకుళం



శ్రీకాకుళంలో ఉదయం పొగమంచు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: జిల్లా మంచు దుప్పటి కప్పుకుంది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం పది గంటల వరకు శ్రీకాకుళం నగరం మొత్తాన్ని పొగ మంచు కమ్మేసింది. ఎదుటి వాహనం కూడా కనిపించనంతగా మంచు కురిసింది. దీంతో వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు చలికి తట్టుకోలేక ప్రజలు వణికిపోయారు. వేకువన పనులకు వెళ్లే వారికి మాత్రం మంచుతో కూడిన మనోహర దృశ్యాలు తారసపడ్డాయి. ప్రధాన రహదారులతో పాటు పచ్చని పంట పొలాలు, చెరువులు చుట్టూ కమ్ముకున్న మంచుతెరలు అందాలను ఆవిష్కరించాయి. ఈశాన్యం నుంచి చల్లని గాలులు, సముద్రం నుంచి వస్తున్న వేడి గాలులు క్రాష్ కావడం వల్ల ఒక్కసారిగా పొగ మంచు కురుస్తోందని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు చెబుతున్నారు. ఈ మంచుతో శ్వాసకోస వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు, ఇదే పరిస్థితి కొనసాగితే జీడి, మామిడి తదితర ఉద్యానవన పంటలకు కాస్త ముప్పు ఉందని ఉద్యానవన శాఖ అధికారులంటున్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో..



పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఈ నూతన సంవత్సరంలో ప్రతి కుటుంబంలోనూ సుఖ సంతోషాలు వెల్లివిరియాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేసి ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలంతా సీఎం జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, పార్టీ నాయకులు కరిమి రాజేశ్వరరావు, అంధవరపు సూరిబాబు, శిమ్మ రాజశేఖర్, ఎంవీ పద్మావతి, డాక్టర్ దానేటి శ్రీధర్, ఎన్ని ధనుంజయరావు, సిజ్జు, డాక్టర్ శ్రీనివాసపట్నాయక్, పాలిన శ్రీనివాస్, పి.సుగుణారెడ్డి, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

4న బ్రెయిలీ జయంతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జనవరి 4వ తేదీన లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు జిల్లా దివ్యాంగుల శాఖ నిర్వహించనుంది. ఆ మేరకు ఆ శాఖ ఏడీ ఎం. కిరణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జెడ్పీ సమావేశమందిరంలో ఉంటుందని తెలిపారు. ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

విద్యాభివృద్ధికి కృషిచేయాలి



ఏపీటీఎఫ్ డైరీ ఆవిష్కరిస్తున్న డీఈఓ, సంఘ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ పిలుపునిచ్చారు. ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ(247/1947) డైరీ, క్యాలెండర్, జీవో పుస్తకాలను శనివారం ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి, జిల్లా ధ్యక్షుడు మజ్జి మదన్మోహన్, జిల్లా కార్యదర్శులు చావలి శ్రీనివాస్, దాసరి రామ్మోహన్‌రావు, రాష్ట్ర కౌన్సిలర్ సదాశివుని శంకర రావు, సీనియర్ నాయకులు రౌతు గణపతిరావు, నాయుడు పాల్గొన్నారు.

మాల్దీవుల్లో చిక్కుకున్న సిక్కోలువాసులు

ఇచ్ఛాపురం:

మాల్దీవుల్లో చిక్కుకుపోయిన తమను కుటుంబ సభ్యుల వద్దకు చేర్చాలని ఇచ్ఛాపురం పరిసర ప్రాంతాలకు చెందిన బాధితులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. విశాఖలోని ఓ ఏజెంట్ ద్వారా శ్రీకాకుళం జిల్లాకు చెందిన 27 మందితో పాటు ఒడిశాకు చెందిన ఐదుగురు యువకులు మాల్దీవుల్లోని జావ్స కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ కంపెనీకి గత ఏడాది ఉపాధి కోసం వెళ్లారు. మూడు నెలలు జీతాలు ఇచ్చి తర్వాత చెల్లించలేదు. మిగిలిన నెలల జీతాలు చెల్లించాలని అడిగితే పాస్‌పోర్టులు తీసుకొని వారు చెప్పినట్టే చేయాలని ఇబ్బంది పెడుతున్నారని బాధితులు వాపోయారు. ప్రభుత్వం చొరవ తీసుకుని తమను స్వగ్రామాలకు తీసుకు రావాలని కోరుతున్నారు.



సమస్య వివరిస్తున్న జిల్లావాసులు

ప్రారంభ దశలోనే కిడ్నీవ్యాధిని గుర్తించాలి

- జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

కంచిలి: ఉద్దానంలో కిడ్నీ వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. మండలంలోని తలతంపర గ్రామంలో శనివారం ఉదయం కిడ్నీ వ్యాధులు అనే అంశంపై నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రారంభ దశలో గుర్తించి, ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని వ్యాధి తీవ్రత నుంచి ఉపశమనం పొందాలని సూచించారు. ఇందుకోసం అవసరమైతే తమను సంప్రదిస్తే, అవసరమైన వైద్యసేవల్ని తమ ద్వారా ప్రభుత్వానికి సూచించి, సేవలందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వైద్యశిబిరాన్ని నిర్వహించి, స్థానికులకు వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, పలాస జూనియర్ సివిల్ జడ్జి పి.రవిశంకర్, సోంపేట అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రాము, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ విద్యాసాగర్, వైద్యుడు డాక్టర్ జగబంధు దొళాయి, సోంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. పున్నయ్య, కాశీబుగ్గ డీఎస్పీ శివరామిరెడ్డి, స్థానిక ఎంపీడీఓ చల్లా శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇచ్ఛాపురం, కవిటి ప్రాంతాల్లోనూ ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యా ప్రమాణాలు పాటించాలి



మాట్లాడుతున్న వీసీ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: డిగ్రీ విద్యలో ప్రమాణాలు విధిగా పాటించాలని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీలో శనివారం డిగ్రీ కోర్సుల బోర్డాఫ్ స్టడీస్ చైర్మన్లు, సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ అవసరాలు, ఉద్యోగ, ఉపాధి కల్పన దృష్టిలో పెట్టుకుని బోధ న సాగించాలన్నారు. ఉన్నత విద్యామండలి అకడమిక్ క్యాలెండర్ మేరకు క్లాస్ వర్కు, పరీక్షలు జరగాలన్నారు. కాలనుగుణంగా సిలబస్‌ల్లో మార్పులు తప్పనిసరని స్పష్టం చేశారు. డిగ్రీలో ఇంటర్న్‌షిప్, విద్యార్థుల ప్రయోజనం కోసం సర్టిఫికెట్లు అందుబాటులో ఉంచే డిజీ లాకర్ సిస్టం వంటివి ప్రారంభించినట్లు చెప్పారు. ఉద్యోగ అవకాశాలకు దోహదపడే కొత్త కోర్సు లు ప్రారంభం లక్ష్యంగా ముందుకు సాగుతున్న ట్లు తెలిపారు. సమావేశంలో రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ బిడ్డి క అడ్డయ్య, డీన్‌లు ఉదయ్‌భాస్కర్, అనురాధ, పాలక మండలి సభ్యులు రాజేష్, స్వప్నవాహిణి, రాజేష్, చిన్నారావు పాల్గొన్నారు.

3న అంతర వర్సిటీ పోటీలకు ఎంపికలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం తరఫున అంతర వర్సిటీ పోటీల్లో పాల్గొనే మహిళల, పురుషుల ఖోఖో జట్లు, పురుషుల హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికలు ఈ నెల 3న నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి స్పోర్ట్సు డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో ఉదయం 11 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. వర్సిటీ అఫిలియేషన్ కళాశాలల విద్యార్థులు ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని సూచించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



పొందూరు: మండలంలోని లైదాం రైల్వేగేటు సమీపంలో తుంగపేట వద్ద శనివారం రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు జీఆర్‌పీ పోలీసులు తెలిపారు. నీలం టీషర్టు, లుంగీ ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. వివరాలు తెలిసిన వారు 70132 73731 నంబరును సంప్రదించాలని కోరారు.

ఏపీ చెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా కిశోర్



శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా జిల్లాకు చెందిన బగాది కిశోర్ ఎన్నికయ్యారు. విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీ వేదికగా ఇటీవల జరిగిన ఆంధ్ర చెస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో 13 జిల్లాలకు చెందిన ముఖ్య ప్రతినిధులు కిషోర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈయన జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షునిగా వ్యవహరిస్తూ చెస్ అభివృద్ధికి పాటుపడుతున్నారని ఆంధ్రా చెస్ అసోసియేషన్ కార్యదర్శి సనపల భీమారావు తెలిపారు.

పీఎంజీకేఏవై పక్కాగా అమలుకావాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్నయోజన (పీఎంజీకేఏవై) జిల్లా లో పక్కాగా అమలుకావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ పౌర సరఫరాల సిబ్బందిని ఆదేశించారు. శనివారం బలగలోని రేషన్ డిపోను సందర్శించి బియ్యం పంపిణీని పరిశీలించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్డులోని ప్రతి లబ్ధిదారునికి ఐదు కేజీలు చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వలంటీర్ల నుంచి కూపన్లు పొందాలని సూచించారు. సంపూర్ణ ఆహారంతో ఆరోగ్యకరమైన కుటుంబాన్ని అందించాలనేదే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో డీలర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

పోలీస్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీస్ అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎస్పీ జి.ఆర్.రాధిక ఆవిష్కరించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, పరిపాలనాధికారి శివరామరాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.రాధాకృష్ణ, జిల్లా అసోసియేషన్ సభ్యులు ఆర్.కృష్ణంనాయుడు, భుజంగరావు, నర్సింహులు, జగదాంబ పాల్గొన్నారు.

రిటైర్డ్ హోంగార్డుకు సన్మానం



వేణుగోపాలరావును సత్కరిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం సేవలందించి శనివారం ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు బాడాన వేణుగోపాలరావును ఎస్పీ జి.ఆర్.రాధిక సన్మానించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయానికి వేణుగోపాలరావు దంపతులను ఆహ్వానించి దుశ్శాలువతో సన్మానించి జ్ఞాపిక, ప్రశంసాపత్రం, ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని చెప్పారు.

హైందవమార్గమే 'మేలుకొలుపు'



మేలుకొలుపులో భజన చేస్తున్న భక్తులు

గార: హైందవ మార్గమే మేలుకొలుపులో ఒక పద్ధతని శ్రీపురం గ్రామానికి చెందిన శ్రీరామ భజన బృందం ప్రతినిధి ఉంగటి చిన్నంనాయుడు అన్నారు. 40 ఏళ్లుగా మేలుకొలుపు భజనల ద్వారా ధనుర్మాస రోజుల్లో పలు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. శనివారం వేకువ జామున రామచంద్రాపురం పంచాయతీ శిమ్మపేట, అంబటివానిపేట, జొన్నలపాడు తదితర గ్రామాల్లో మేలుకొలుపు నిర్వహించారు. పలు భక్తిగీతాలు ఆలపించారు.

మత్తు పదార్థాల విక్రయాలు అరికట్టాలి



నినాదాలు చేస్తున్న ఏబీవీపీ విద్యార్థులు

శ్రీకాకుళం క్రైమ్ : మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం అఖిల భారత విద్యార్థి పరిషత్ విద్యార్థులు కోరారు. ఈ సందర్భంగా శ్రీకాకుళంలో వివిధ కళాశాలల విద్యార్థులు పాతబస్టాండ్ మీదుగా అవగాహన ర్యాలీ చేపట్టారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండండి.. మంచి భవిష్యత్తు ముందుంది.. అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కన్వీనర్ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలో కొన్నిచోట్ల మత్తుపదార్థాలు విక్రయాలు జరుపుతున్నారని.. బలహీన క్షణాల్లో యువత వీటికి అలవాటుపడుతున్నారని చెప్పారు. పోలీసులు నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఎస్‌ఐకు వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్ అనే వ్యక్తిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి, అయ్యప్ప సేవా సంఘం జిల్లా కన్వీనర్ శ్రీరంగం మధుసూదనరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని ఎన్‌జీవో కార్యాలయం వద్ద శనివారం విశ్వ హిందూపరిషత్, భజరంగ్‌దళ్, శబరిమల అయ్యప్ప సేవా సమాజం, అయ్యప్ప భక్త బృందం నిరసన చేపట్టారు. అనంతరం శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్‌ఐ బలివాడ గణేష్‌కు వినతిపత్రం అందజేశారు.

ద్రవ జీవామృతంతో భూసారం

ఎచ్చెర్ల క్యాంపస్: ద్రవ జీవామృతంతో భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ప్రచారకులు అరుణ, పోలీస్ వివరించారు. ద్రవజీవామృతం తయారీ, వినియోగంపై శనివారం కొంగరాంలో ప్రకృతి వ్యవసాయ రైతులకు అవగాహన కల్పించారు. ఆవుపేడ, మూత్రం, నీటితో జీవామృతం తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది హేమలత పాల్గొన్నారు.

11 నుంచి సంక్రాంతి క్రీడా సంబరాలు

శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం(పీఎన్ కాలనీ): ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో రావికంటిపేటలో ఈ నెల 11 నుంచి 13 వరకు 'జగనన్న సంక్రాంతి సంబరాలు' పేరిట ఉత్తరాంధ్ర స్థాయిలో వాలీబాల్ పోటీలు, జిల్లాస్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు శనివారం తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ యువతలో క్రీడా నైపుణ్యం వెలికితీసేందుకు పోటీలు దోహదపడతాయని చెప్పారు. వాలీబాల్, కబడ్డీ క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన ఇరు జట్లకు చెరో రూ.50వేల చొప్పున, రెండో స్థానానికి రూ. 30 వేలు, మూడు, నాలుగో స్థానంలో నిలిచిన జట్లకు రూ.20 వేలు చొప్పున నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేయనున్నట్టు రవికుమార్ వివరించారు. క్రీడాకారులకు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. క్రీడలతోపాటు మహిళలకు ముగ్గులు పోటీలు, విద్యార్థులకు జగనన్న నవరత్నాల పథకాలకు సంబంధించి విశ్లేషణాత్మక పోస్టర్స్ తయారీ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆమ దాలవలస నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు చిగురుపల్లి రవికుమార్, బత్తుల లక్ష్మణరావు,, కెప్టెన్ పైడి రామారావు, అన్నెపు కృష్ణ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన, చింతాడ రవికుమార్

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

జి.సిగడాం: గ్రామాల్లో నెలకొన్న భూసమస్యలపై ఎవరూ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు సూచించారు. శనివారం తన కార్యాలయంలో వీఆర్‌ఓ, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసర్వే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. వ్యవసాయ రుణాల రెన్యువల్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. వన్-బీ రాకపోతే సంబంధిత వీఆర్‌ఓ నేరుగా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ నిర్మల, ఆర్ఐ రామచంద్రరావు, వీఆర్‌ఓలు భూపతి నర్సింగరావు, పిన్నింటి సింహాచలం, నీలకంఠం, ఎరకయ్య, జగన్నాథం పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలవాలి

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

లావేరు: జనరంజక పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కోరారు. లావేరు మండలం తాళ్లవలస, సుభద్రాపురం గ్రామాల్లో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను అడిగితెలుసుకున్నారు. జగనన్నకు అండగా నిలిచి మరోసారి సీఎంగా చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మీసాల సీతన్నాయుడు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, బూత్ కమిటీ కన్వీనర్ మీసాల శ్రీనివాసరావు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు షేక్‌చాన్‌బాషా, తాళ్లవలస సర్పంచ్, ఎంపీటీసీలు బంకపల్లి సీతమ్మ, యండ రాజులమ్మ, నాయకులు సంచాన సత్యనారాయణ, మహంతి శిమ్మినాయుడు, శాంతాటి మురళీకృష్ణ, మొంగం గోవిందరావు, మీసాల నర్సింహం, కిల్లారి శేఖర్, మొంగం రమణ, మీసాల వెంకటరమణ, పైడి అప్పారావు, కంది శ్రీను, బంకపల్లి సోములు, యండ అప్పారావు, గుడివాడ అప్పలరాజు, మీసాల రాంబాబు, మీసాల శ్రీను, మీసాల వెంకటరమణ, అధికారులు పాల్గొన్నారు.



పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

సందడే సందడి



శ్రీకాకుళం పీఎన్ కాలనీలోని న్యూసెంట్రల్ స్కూల్‌లో పిండివంటల ప్రదర్శన



తాళ్లవలస అంగన్‌వాడీ కేంద్రంలో వేడుకలు



అంబేడ్కర్ వర్సిటీలో నూతన సంవత్సర వేడుకల్లో మాట్లాడుతున్న వీసీ వెంకటరావు

నూతన సంవత్సరం సందర్భంగా శనివారం పలుచోట్ల ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. విద్యాసంస్థల్లో వినూత్న పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కొత్త సంవత్సరం అందరికీ శుభం కలగాలని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

- రణస్థలం/శ్రీకాకుళం న్యూకాలనీ/ ఎచ్చెర్ల క్యాంపస్/లావేరు/శ్రీకాకుళం కల్చరల్/ జి.సిగడాం



రణస్థలంలోని క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



జి.సిగడాంలో సిద్ధంగా ఉన్న కేకులు



రామకృష్ణ సేవాసమితి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ నవీన్



శ్రీకాకుళంలోని గాయత్రి అపార్ట్‌మెంట్‌లో మొక్కలతో స్వాగతం పలుకుతూ..

రైతులకు రాయితీపై పనిముట్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వం నిర్దేశించిన రాయితీ ధరలకే వ్యవసాయ పనిముట్లను రైతులకు అందజేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలోని వ్యవసాయ పనిముట్ల తయారీదారులు, పంపిణీదారులతో జిల్లా ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశం శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. జిల్లా అధికారి కె.శ్రీధర్, జిల్లా ఉద్యానవన అధికారి ఆర్.వి.ప్రసాద్, రాగోలు పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.ఉదయ్ బాబు, జిల్లా ఆగ్రోస్ మేనేజర్ చంద్రశేఖర్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు టి.భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవీన్

పెండింగ్ మస్టర్లపై దృష్టి సారించాలి

గార: ఉపాధి హామీ పథకంలో వేతనదారుల పెండింగ్ మస్టర్లపై అధికారులు దృష్టి సారించాలని కె.సైరిగాం సర్పంచ్ మార్పు ఆదినారాయణ కోరారు. శనివారం గార మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఏటా అధికారుల నిర్లక్ష్యం వల్ల వేతనదారులు నష్టపోతున్నారని చెప్పారు. దీనిపై ఎంపీపీ రఘురామ్ స్పందిస్తూ పూర్తి నివేదికలతో హాజరుకావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మార్పు సుజాతమ్మ, ఎంపీడీఓ శిమ్మ రామ్మోహనరావు, డీటీ ప్రసాదరావు, వాడాడ సర్పంచ్ సుంకాన సురేష్, సుగ్గు మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పెరటి కోళ్ల పెంపకంతో ఆదాయం

రణస్థలం: మహిళలు పెరటి కోళ్ల పెంపకంతో అధిక ఆదాయం అర్జించవచ్చని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. రణస్థలం వెలుగు కార్యాలయం ఆవరణలో పలువురు మహిళా లబ్ధిదారులకు పెరటి కోళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 50 యూనిట్ల పెరటి కోళ్లు, దాణా బ్యాగులు వచ్చాయని, ఒక్కో యూనిట్ విలువ రూ.3975 అని వివరించారు. కార్యక్రమంలో జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు మైలపల్లి కామరాజు, మహంతి పెదరామినాయుడు, పిల్ల ఆనందరావు పాత్రుడు, పచ్చిగుళ్ల సాయిరాం, మహంతి సత్యనారాయణ, ఎంపీడీఓ ధనుంజయరావు, ఏపీఓ శ్రీనివాసనాయుడు పాల్గొన్నారు.



పెరటి కోళ్లు పంపిణీ చేస్తున్న పిన్నింటి సాయికుమార్